# ఎలిజీలు

## – గొల్లపూడి మారుతీరావు



కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలమ్స్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన అశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

### ఒక దీపం మలిగింది

నా జీవితంలో నేను వ్రాసిన తొలి చిత్రానికి మాటల రచయిత ఆచార్య ఆత్రేయ. 'డాక్టర్ చక్రవర్తి' చిత్రానికి నేను 'చక్రభ్రమణం' నవలని సినిమా అనుసరణ చేశాను - దుక్కిపాటి మధుసూదనరావుగారి సారథ్యంలో. చాలా రోజులు తర్జన భర్జనలు చేశాక ఆత్రేయగారు వస్తున్నారంటే ఆతుతగా ఎదురుచూశాను. ఆయనకి అప్పటికే నేను తెలుసు. నా 'రాగరాగిణి' మద్రాసులో ప్రదర్శించినప్పుడు చూశారు. కలిశాను. వారి కప్పలు, వరప్రసాదం, మనిషి చావకూడదు, భయం, ఎవరు దొంగ? - ఇవన్నీ నాకు కాలేజీనాటినుంచి సుపరిచితాలు. సినిమాల కంటే ఆత్రేయగారంటే మాకు నాటకాల గ్లామరు. ఆత్రేయగారొచ్చారు. చక్కగా స్నానం చేసి మల్లెపువ్వులాగా తయారయి నేను వ్రాసినదంతా విన్నారు. మధుసూదనరావుగారు వెళ్ళాక "ఇదా స్క్రీన్‌ప్లే అంటే? ఇది లేకపోయినా నేను డైలాగులు వ్రాయగలను" అన్నారు నవ్వుతూ. అదీ ఆత్రేయగారి ఆత్మ విశ్వాసంతో నా తొలి పరిచయం.



ఆ రోజుల్లో మాటలకంటే పాటలు వ్రాయడంలో ఆయన ఉత్సాహం ఎక్కువ చూపేవారు. (అప్పటికింకా 'మూగమనసులు' రెడీకాలేదు) "పాడమని నన్నడగతగునా?" అన్న పాట వ్రాసి మాటలు వ్రాస్తానని అయిదురోజులు ఊరించి, కుక్క బిస్కట్ల దగ్గర్నుంచి, మంచి పెన్నుల దాకా రకరకాల సామాగ్రి కొని ఎవరికో బాగోలేదని దొంగ టెలిఫోన్ మద్రాసు నుంచి రప్పించుకుని ఓ రోజు తెల్లవారేసరికి మద్రాసు వెళ్ళిపోయారు. అదీ ఆయన అభిరుచితో, అంతకు మించిన ఆయన బద్ధకంతో నా తొలి పరిచయం.

ఆయన్ని మా యింటికి భోజనానికి పిలిచాను. ఉత్త పుణ్యానికి టాక్సీ తీసుకుని ఊరంతా మంచి స్వీట్స్ కోసం తిరిగి, తిరిగినందుకు నూరు రూపాయలు ఖర్చుపెట్టి, స్వీట్స్‌కి ముప్ఫై రూపాయలు ఖర్చుపెట్టి మా యింటికొచ్చి భోజనం చేశారు. అదీ ఆత్రేయ దుబారాతో నా తొలి పరిచయం.

ఆత్రేయ సంపాదించినంత డబ్బు బహుశా సినీరంగంలో ఏ రచయితే సంపాదించి ఉండరు. ఆయన ఖర్చు చేసినంత అలవోకగా కూడా ఎవరూ చేసి ఉండరు. డబ్బు విలువ బొత్తిగా తెలియనివాడు. డబ్బుతో విలువ కట్టలేని అపూర్వమయిన సాహితీ సంపద కలవాడు ఆత్రేయ. ఆయన వ్రాయడానికి పెట్టే బాధల్ని అనుభవిస్తూ ఆయన బాధలు పెడుతున్నారని గర్వంగా చెప్పుకుంటూ ఆ అనుభవించిన చివర ఓ గొప్ప పాటనో, ఓ గొప్ప స్క్రిప్టునో తప్పని సరిగా చేజిక్కించుకొన్న ఎందరో అసిస్టెంటు డైరెక్టర్లు నాకు తెలుసు. ఆయన ఎంత తాత్సారం చేసిన ఆత్రేయంటే పడిచచ్చే నిర్మాతలు, ఆత్రేయ రూపాయి కావాలంటే పదిరూపాయలు ఆనందంగా ఇచ్చేవాళ్ళు తెలుసు. దానిక్కారణం - పదికాలాల పాటు మనస్సులో బ్రతికే మన్నికయిన సాహిత్యం అంతకుముందు, ఆయన తలచుకుంటే ఆ తర్వాత ఎప్పుడయినా ఆయన అందివ్వగలడని వాళ్ళకి తెలుసు. వాళ్ళకి తెలుసునని ఆయనకీ తెలుసు. ఆత్రేయ గర్వి. తనని చూసి గర్వించే ఒక రకం అభిమానులు తనకున్నారని స్ఫురణ ఉన్న గర్వి. అంతకు మించి ఏ సంపదనీ ఆయన ఆశించలేదు, మిగుల్చుకోనూ లేదు.

ఓ రోజు హోటల్ స్వాగత్‌లో నేనూ, మధుసూదనరావుగారూ కలిసి భోజనం చేసి లేస్తూంటే ఆత్రేయ కలిశారు. చిరునవ్వుతో పలకరించి కారెక్కారు. రాత్రి పది గంటలపైన అన్నపూర్ణా ఆఫీసుకి ఫోన్. కారు పంపిస్తున్నాను బయలుదేరి రమ్మని. టాప్‌లెస్ బ్యూక్ వచ్చింది. స్వాగత్ హోటల్‌కి వెళ్ళాను. ఇద్దరం కలిసి జమ్మీ బిల్డింగ్స్ దగ్గర దాశరథిగార్ని ఎక్కించుకున్నాం. ముగ్గురం కలిసి మెరీనా బీచికి చేరాం. రాత్రి రెండు వరకు కబుర్లు చెప్పుకున్నాం. సాహిత్యం గురించా? జీవితం గురించా? సినిమాల గురించా? ఇప్పుడు గుర్తులేదు. డైరీ చూడాలి. అదీ ఆత్రేయ స్నేహంతో పరిచయం.

నాటకాల్లో మాకంటే ముందు తరం రచయితగా తప్ప, ఆత్రేయ గొప్పతనం ముఖ్యంగా సినీ రచయితగా నాకు తెలిసేది కాదు. ఆ మాత్రం సరళంగా ఎవరయినా ఆపాటి రచన చెయ్యలేరా అనిపించేది. అన్నపూర్ణా ఆఫీసులో సినీరచనకి నాకు మధుసూదనరావుగారు ముందుగా అందించిన పెద్ద బాలశిక్ష 'తోడికోడళ్ళు' స్క్రిప్టు. ఇదెంత కష్టం? అదీ మొదటి ఆలోచన.

కానీ సంవత్సరాలు గడిచి, జీవితంలో ఒడుదుడుకులు తెలిసి, అనుభవాలు పండి, ఆ అనుభవసారాన్ని రోడ్డు మీద పోయే రిక్షావాడి నాలుక మీద అనలిగే ధోరణిలో సామాజిక స్పృహ ఏ కోశానా విడవని ఓ సరళమయిన రచన - ఎంతటి మహత్తరమయిన సాధనో తరువాత్తరువాత తెలిసింది. సెకనుకి 24 ఫ్రేములు దాటే సినీ మీడియంలో చెప్పిన మాటల్లో అర్థాన్నో, అర్థంలోని ఆలోచననో, ఆలోచనలోని అనుభూతినో వెనక్కి తిరిగి తడుపుకోడానికి అవకాశం ఇవ్వకుండా, దూసుకుపోయేలాగా చెప్పిన ఒకే ఒక్క కవి ఆత్రేయ.

ఆరుద్ర, పద్మరాజు, విద్వాన్ విశ్వం అందరిచేత రేడియో నాటికలు వ్రాయించాను. ఒక్క ఆత్రేయ చేత వ్రాయించడంలో ఓడిపోయాను. ఎందుకంటే తెలుగు సినీ సాహితీ రంగంలో ఆయనొక్కడే శ్రీనాథుడు. ప్రభుత్వమనే పేద సంస్థకి అందనంత పెద్ద రచయిత ఆయన. ఈ చట్రాలలోకి ఆయన్ని లాగలేకపోయాను.

30 ఏళ్ళు కలిసి నడిచిన సాహితీ ప్రపంచంలో చాలా అడుగులు కలిసే పడ్డాయి. చెప్పాలంటే ఈ కాలమే చాలదు. ఆత్రేయ నీడ అందరికన్నా పొడవయినది. సినీ సాహితీ రంగంలో చాలాముందు తరాలకు ఆయన నీడ దారి పొడుగునా కనిపిస్తుంది.

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments